603118901

సాటి మానవులను నీవు సాధింపనేల
ధర్మ మెపుడు నీవు తప్పకున్న
భారతంబు లోని పరమార్థమిదియెగా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

ధర్మమనగా ధారయతీతి ధర్మః అని. ఇంకా అనేక విధములుగా వేద శాస్త్ర యితిహాస పురాణములు వర్ణిస్తూ వచ్చాయి. కాని త్రిగుణముల యొక్క ఏకత్వమే బ్రహ్మము. మనోవాక్కాయముల యొక్క ఏకత్వమే బ్రహ్మము. The Proper Study of mankind is man. Thoughts, words, actions ఈ మూడింటి యొక్క సమత్వమే ధర్మము. ఈ పవిత్రమైన ధర్మము ఏ వ్యక్తి తన హృదయమునందు చేర్చుకొనునో అట్టి వానికి సర్వమూ విజయమే. దుష్టుడు, దుర్మార్గుడైన దుర్యోధనుడు తను యుద్ధమునకు సిద్ధమై తన తల్లికి నమస్కరించే నిమిత్తమై అంతఃపురము ప్రవేశించాడు. తల్లికి నమస్కరించి తల్లీ! విజయం చేకూరునట్లుగా ఆశీర్వదించమని కోరాడు. కాని గాంధారి ఆవిధముగా చేయలేదు. యతో ధర్మస్తతో జయః అన్నది. కుమారుడైనప్పటికి ధర్మమనకు విజయాన్ని సాధింపచేస్తుంది అని ఆ తల్లి ఆశీర్వదించింది. గురువైన ద్రోణాచార్యుని దగ్గరకు వెళ్ళాడు దుర్యోధనుడు. ఈ ద్రోణాచార్యుడు కూడా యతో ధర్మస్తతో కృష్ణః. యతో కృష్ణస్తతో జయః. అన్నాడు. ఎక్కడ ధర్మమో అక్కడ కృష్ణుడు. ఎక్కడ కృష్ణుడో అక్కడ విజయం చేకూరుతుందని చెప్పాడు. భగవద్గీత కూడా ధర్మముతో ప్రారంభమై విజయముతో అంత్యము గావించింది. ధర్మక్షేత్రే కురుక్షేత్రే.... మొదటి శ్లోకంలో First word ధర్మంతో ప్రారంభమైంది. కట్టకడపటి శ్లోకము

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

ఎక్కడ కృష్ణుడు, ఎక్కడ ధర్మము రెండింటి యొక్క సమ్మిళిత స్వరూపము వుండునో అక్కడే విజయము. కనుక ధర్మముతో ప్రారంభమైనప్పుడే విజయాన్ని మనము వరించగలము. విజయమే మనలను వరించగలదు.

ఐతే ఈనాటి మానవుని యొక్క జీవితము మూడు విధములైన దుఃఖములలో మునిగి వుంటున్నవి. ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము అని మూడు విధములైనవి. ఈ ఆధ్యాత్మిక మనగా శరీరమునకు సంబంధించిన రోగములు. మానసిక సంబంధమైన రోగములు. ముఖ్యముగా మానసిక సంబంధమైన రోగమంతే శరీరమును అమితంగా బాధిస్తూ వస్తున్నాయి. ఈనాడు దేహమునకు సంబంధించి విశ్రాంతి భవనముల అభివృద్ధి గావించుచున్నారే గాని, మానసిక సంబంధమైన విశ్రాంతికి తగిన భవనములు ఎక్కడనూ లేవు. ఈ మానసిక సంబంధమైన విశ్రాంతి భవనములు కేవలము మందిరములే. కనుకనే

దేహో దేవాలయప్రోక్తో జీవోదేవస్సనాతనః. ఈ దేహమే ఒక పెద్ద మందిరము. ఈ దేహమునందున్న ఆత్మ స్వరూపుడే యీ ఆకారుడైన దైవత్వము. కనుక యీ దేహమును ఒక దేవాలయముగా విశ్వసించి, యీ దేవాలయము మనకు సంబంధించిన పవిత్రతను మనం అందించటానికి ప్రయత్నించినప్పుడే మనకు ధర్మము ఆవిర్భవిస్తుంది. అట్టి పవిత్రమైన భావములు, ప్రవర్తనలు కోల్పోవటం చేతనే యీనాడు దేహము, మనస్సు రెండు అనారోగ్యమునకు గురౌతున్నాయి. దేహముతో పవిత్రమైన కర్మలు, మానసికంగా పవిత్రమైన భావములను అభివృద్ధిగా పెంచుకున్నప్పుడే యీ దేహ మనస్సులు రెండూ కూడా ఆరోగ్యమును అనుభవిస్తాయి. అప్పుడే ఆధ్యాత్మికమనే అనారోగ్యమునకు మనము అతి దూరముగా వుండగలము. ఆధ్యాత్మికమనగా శారీరక, మానసిక రోగముల చేత పీడింపబడునదే ఆధ్యాత్మికము.

ఆదిభౌతికమనగా యిది కొన్ని శత్రువుల చేత బాధింపబడుతున్నది. కొన్ని మృగముల చేత హింసింపబడుతోంది. క్రిమికీటకాదుల చేత కూడా బాధింపబడుతున్నది. అన్నింటికంటె అధికంగా మృత్యువు అనే శత్రువు అనేక రోగముల సైన్యములో యీ దేహమును ముట్టడిస్తోంది. ఈ ఆదిభౌతికము అనేక రకముల హింసల చేత నిండివుంటున్నది. ఆదిదైవికమనగా ఏమిటి? సంకల్పించకుండానే కొన్ని బాధలు మనకు చేకూరుతున్నాయి. కొన్ని కలరా, ప్లేగు వ్యాధులని, పిడుగులని యిలాంటివి సంభవించి మానవునికి అనేక విధముల దుఃఖములు సంభవిస్తున్నాయి. మోటార్ సైకిలు ఏక్సిడెంటులో పోవచ్చు plane accident లో పోవచ్చును.

ఆకార మానవత్వము మాత్రమే యీనాడు గుర్తించటానికి వీలవుతున్నది గాని ఆచార తత్వములో గాని, ఆనంద తత్వములో గాని యీ యొక్క మానవత్వం కనుపించుటము లేదు.

ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా
పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా
పులిచర్మము కప్పినట్టి గాడిద పులియగునా

కాదు. కాదు. మానవత్వమనబడే చర్మము కప్పబడిన మృగముగా జీవిస్తున్నాడు యీనాడు విలువలేని పంట, కరెంటు లేని వైరు, టీచరు లేని బడి. తానెవరో గుర్తించుటకు తగిన కృషి చెయ్యాలి. నేనెవరు? యీ question తో ప్రారంభము కావాలి. I am so and so అంటారు. కాని యిది రూపనామములకు సంబంధించినదే. కాని nature కాదు. It is my body but I am not the body. This is my mind but I am not the mind. Then who am I? This is my kerchief. The kerchief is seperate from me. my body అని చెప్తే I am different from my body. Then who are you? ఇన్నింటికి ఆది భూతమైన తత్వం ఒకటి వున్నది. అదియే యీ తత్వము. ఈ మానవత్వాన్ని మొట్టమొదట గుర్తించాలి.

603118903

మానవుడంటే ఏమిటి? మనసు కల్గిన వాడు మానవుడు. కొబట్టి మనసు వల్లనే మనిషి అనే పేరు వచ్చింది. మనిషి అంటే ఎవరు? మనసంటే ఏమిటి? సంకల్ప వికల్పముల యొక్క చేరికయే. సంకల్పము లంటే ఏమిటి? నిత్య జీవితములో మనం అనుభవించే ఆచరణలే. ఈ ఆచరణంటే ఏమిటి? మన యొక్క కర్మానుబంధముగా వచ్చిన results. అనగా reaction. కనుక మానవత్వమనగా reaction, reflection and resound. అని చెప్పవచ్చు. మనం చేసిన వన్నీ reactionగా వస్తున్నాయి; resound గా వస్తున్నాయి. reflectionగా వస్తున్నాయి. కనుక మంచిని చేయుటకు ప్రయత్నించాలి. మొట్టమొదట జగత్తులో మనిషి అనిపించుకొనుటకు తగిన ప్రయత్నం చేయాలి.

జగతిని జీవించువాడు మనుజుడు కావలె మొదట
దనుజులందు దుష్కృత్యము పొగడు వాడు చవట
బ్రహ్మ విద్య నేర్చియుచట ఆత్మతత్వము గనుగొనుట
తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞాన మేమి తెరుగు.

కనుక మొట్టమొదట తన తత్త్వాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించాలి. కాని మానవుడు యీనాడు అన్నింటికి బాధపడుతున్నాడు. దేనికోసం? ధర్మంకోసం బాధపడుటలేదు.

పుట్టినప్పుడు ఏడ్చినారు చచ్చునపుడు ఏడ్చుతారు
మధ్యమధ్య చింతలతో ఎందెందుకో ఏడ్చుతారు
ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార
ఎందుకోసమేడ్చినారు ఏడ్పుకోసమేడ్చినారా?

ఎందుకోసం ఏడుస్తున్నాడో మానవుడు అర్థం చేసుకోటంలేదు. దైవం కోసం ఏడ్వాలి. ధర్మం కోసం ఏడ్వాలి. ధనం కోసం ఏడ్వటం కాదు. ధరణి కోసం ఏడ్వటం కాదు. దుర్యోధనుడు ధనంకోసం, ధరణి కోసం ఏడ్చాడు. కాని అర్జునుడు ధర్మంకోసం దైవం కోసం ఏడ్చాడు. ఈ ధర్మంకోసం ఏడవటం వల్లనే అది ఒక విషాద యోగంగా మారింది. కనుక మనము దైవనిమిత్తమై బాధపడాలి. దైవం కోసం ఆరాటపడాలి.

తపస్సు. తపస్సు. తపస్సు. ఏమిటి యీ తపస్సు. తపస్సు అనగా తమస్సు కానిదే తపస్సు. ఈ తపస్సు ఏమిటి? మన మనస్సు వాక్కు క్రియ మూడింటి యొక్క ఏకత్వమే తపస్సు. ఈ తపస్సు మనకు లేకుండా పోతోంది. 'సు' అనగా మంచి మంచి నిమిత్తమై మనము తపస్సు చేయాలి. తనను తాను అభివృద్ధి పరచుకోవాలి అది కావాలి కావాలి అనే తాపమే తపస్సుగా మారిపోతుంది. ఆ తాపము యీనాటి మానవుని యందు చల్లబడిపోయింది. ఆ తాపమును మనము తిరిగి మేల్కొల్పాలి. ఈ తమస్సునుండి మనం తపస్సులోకి ప్రవేశించాలి. ఏ కష్టములు కలిగినా, ఏ బాధలు మనకు అడ్డు తగిలినా ధైర్యముతో దానిని ఎదుర్కొనటానికి తగిన విశ్వాసము మనము

అభివృద్ధి చేసుకోవాలి. ఎట్టి విశ్వాసము? దైవమున్నాడు. తప్పక నాకు ఈ మంచికి సహాయం చేస్తాడు. అనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఆ విశ్వాసమే లేకపోతే దేనినీ మనం సాధించలేము. అన్నింటి యందు మానవునికి ఈనాడు విశ్వాసం అభివృద్ధి అవుతోంది. ఒక్క దైవమునందు మాత్రమే అభివృద్ధి కావటం లేదు. కారణమేమిటి? తన యొక్క బలహీనత. ఈ ప్రాకృతమైన వాసనలపైన తన యొక్క మనస్సును అభివృద్ధి పరచుకోటమే ఈ బలహీనతనకు మూలకారణం.

జగత్తంతా అనిత్యం అసుఖం లోకం. అదియే భగవద్గీతలోని శ్లోకం. ఇది సుఖ సంపదలతో కూడినది కాదు. నిత్యమైనది కాదు. అలాంటి లోకములో మనం ప్రవేశించి శాంతి సుఖము మనకు లభించాలంటే ఎలా మనకు లభిస్తుంది. ఇడ్లీ సాంబారు తినాలని ఆశించి, మిలటరీ హొటలు లోనికి ప్రవేశిస్తే ఇడ్లీ ఎలా చిక్కుతుంది మనకు. మిలటరీ హొటలులో ప్రవేశించి నాకు సాంబారు, అన్నం కావాలంటే ఎలా ఇస్తాడు. అనిత్యము, అసుఖమైన హొటలులో ప్రవేశించి నిత్యము, సుఖము కావాలంటే ఎలా లభిస్తాయి. మనము వున్నది అనిత్యములో. మన జీవితమంతా అనిత్యమైనటువంటిది. నీటి బుడగ వంటిది. అలాంటి దానిలో మనం నిత్యసత్యాన్ని ఆశించటం ఇదియే. ఒక పెద్ద మోహము. కారణము ఏమిటి? సంఘనీతి పోయింది. నిజాయితీని విశ్వసించటం లేదు. మానవత్వమనేది మరచిపోయారు. దైవత్వాన్ని విస్మరించారు. కేవలం దానవత్వంతో, పశుత్వంతో మనం జీవిస్తున్నాము. కాదు. కాదు. మానవుడను అనే విశ్వాసం మనం పెంచుకోవాలి. చాలా మంది మీరు విచారించ వచ్చు. నేను మనిషిని అని అనుకోటం కేవలం half truth. ఇంకో half truth I am not animal. ఈ రెండింటిని ఏకం చేసినప్పుడే పరిపూర్ణమైన మానవుడుగా మనం బ్రతక వచ్చు. వాడు man అనుకుంటున్నాడు. animal work చేస్తున్నాడు. అట్లు కాదు. I am not animal. నేను పశువును కాదు అనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఆవిధమైన సత్య మార్గాన్ని మనము అనుభవించటానికి ప్రయత్నించాలి. అన్నింటికి మూలకారణం ప్రేమనే. ప్రేమ చేత దేనినైనా సాధించ వచ్చు. ప్రేమలో సర్వం కూడా వశం చేసుకోవచ్చును. ప్రేమ లేకపోతే దేనినీ సాధించలేము. కనుక ప్రేమనే ప్రధానమైన ప్రాణము. ప్రేమయే ప్రధానమైన దైవము. ప్రేమ లేని మానవుడు లోకంలో లేడు. అందరియందు ప్రేమస్వరూపుడై వుంటున్నాడు భగవంతుడు. అలాంటి ప్రేమను అనేక రకాలుగా మనం వినియోగపెడుతున్నాము. అందరం

ఒక్క గూటి పిట్టలం
ఒక్క తీగె పువ్వులం
ఒక్క తల్లి పిల్లలం
ఒక్క జాతి బిడ్డలం

603118905

మనలో మనకు
కలత ఎందుకు.

ఈ ఏకత్వము చేత మానవత్వాన్ని పెంచుకున్నామంటే అదే ఏకోహం బహుస్యాం. అంతా ఏకమై పోతుంది. ఈ దేహప్రేమ అనేదానిని ప్రక్కకు పెట్టి ఆత్మ ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి. ఆత్మను ఆధారం చేసుకుంటే యీ దేహము కూడా వశమై పోతుంది. కనుక మనం ప్రేమతత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. దైవ విశ్వాసము పెంచుకోవాలి. ఈ రెండింటిని మనం అభివృద్ధి గావించుకున్నప్పుడే దివ్యమైనటువంటి నవ్యజీవితాన్ని అనుభవించగలము. Life is a game అన్నారు. ఆ game ను మనం play చెయ్యాలి. game, game అనుకుంటూ play చేయకపోతే game ఎలా అవుతుంది? ఆ game play చేసినప్పుడే విజయము మనకు లభిస్తుంది. Life is a dream, realise it. Life is Love, enjoy it. ఇదే మనం చేయవలసింది. Awareness is life. ఏమిటి ఈ awareness! అంతో యింతో తెలుసుకుంటే awareness కాదు. ఇది పూర్తి విప్పి చూపినప్పుడు యిదొక కర్చీఫ్ అని చెప్పవచ్చు. ఇదంతా మూసి వేసి యిది ఏమిటంటే ఏమి చెప్పగలరు? piece of cloth. అంతో యింతో తెలుసుకున్నంత మాత్రమున awareness అని చెప్పకూడదు. అంతా తెలుసుకున్న తరువాతే awareness. మనకు యీనాడు అన్నింటిని తెలుసుకునే శక్తిసామర్థ్యములు లేవు. తెలుసుకున్న కొంత దానినైనా మనం పెంచాలి. కానీ మనం దానిని తగ్గించుకుంటూ పోతున్నాము. సంకుచిత భావంతో చెడిపోతున్నాము. ప్రాచీన కాలములో ఎన్ని సుఖములో అనుభవించిన మహారాజులున్నారు. ఎన్నో రకములైన భోగభాగ్యములను అనుభవించిన వారున్నారు.

కారే రాజులు రాజ్యముల్ గలుగవే
గర్వోన్నతిం బొందరే వారేరి?

నిరత సత్యవ్రతుఁడై ధరనేలిన హరి
శ్చంద్రుడు ధర బాసి చనగలేదె
ఎల్లలోకము లేలి ఎసగు శ్రీ నలరాజు
తనవెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబున నలంకృతిని చేయు మాంధాత
సిరి మూట గట్టుక అరిగినాడె
జలధిసేతువు గట్టె అలనాటి శ్రీరాము
డుర్విపై యిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారో
ఒకరును వెంటగొని పోరు ఉర్వితలము

మన భారత దేశమందే కాదు. ఏ దేశమునందైనా మానవుడు వెళ్ళే సమయములో ఒక పిడికెడు మట్టినైనా తీసుకుని పోడు. ఆ మట్టిని వెనుక తీసుకు వెళ్ళేటట్టయితే భారతదేశములో

మట్టికూడా రేషన్ అయిపోతుంది. మనం పుట్టిన వారము పుట్టినట్టే పోతున్నాము. కనుక మనం ఏవిధమైన దానిని తలలో చేర్చుకుందుకు ప్రయత్నం చేయకూడదు. ఒక్క దైవత్వాన్ని మంచిని మాత్రమే మనం తలలో చేర్చుకోవాలి.

ఈనాడు అనేక ప్రసంగాలు జరుగుతున్నాయి. అనేక విశ్వాసాలతో పూజలు చేస్తున్నారు. భాగవత, భారత పారాయణలంతా వింటున్నారు. కాని ఏమి ప్రయోజనం. లోపల యేమీ చేరటం లేదు. కారణం?

ఏమి లేని బుర్రలోన
ఏమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండియున్న
తలబుర్రది ఖాళీయగునా?
తలబుర్రది ఖాళీగాక
ఇల సుకృతంబు నింపనగున.

కాదు. కాదు.

దుర్బుద్ధుల మనసున్నా దూరులు విను చెవులున్నా
పొంచి చూచు కనులున్నా పంచల విను చెవులున్నా
వంచన గుణా చిత్తమున్నా వంచించే మనసున్నా
ఈ వికృతులు చూడగనే న్యాయించిల నిలువదన్నా.

ఈనాడు అన్నికూడా సంకుచితమైన అవయవముల లోనే కూడి వుంటున్నాడు. ఎదురుగా వచ్చినప్పుడు నమస్కారం. నమస్కారం. అంటున్నాము. వాడటు తిరగగానే ఆహా వాడురా అంటున్నావు. లోఫర్ అంటాము. ఇదే మానవత్వములో చేరిన సంకుచిత భావాలు. ఏ విధమైన వారితో, వారికెదురుగా, వెనుకగా ఒక్కలాగే వుండాలి. ఇదే మానవత్వానికి తగిన విలువ. మనం ఎవ్వరిని విమర్శించరాదు. ఎవ్వరినీ ఏవిధంగా తూలనాడరాదు. అదే ఉపనిషత్తుల యొక్క సారము. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికి నమస్కారం చేయి. ఎవరికి చేసినా దైవానికే చేరుతుంది. అదే విధంగా సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరిని మనము తిరస్కరించినా అది కూడా కేశవునికే చేరుతుంది. కనుక మనం అందరిని గౌరవించటానికి తగిన ప్రయత్నం చేయాలి.

కాలు జారుతే కలుగదు నష్టం
నాలుక జారితే నరకమురా!

జారి పడినా వంటికే దెబ్బ తగలవచ్చు. డాక్టరు దగ్గరకు పోవచ్చును. దానికి మందువేసి bandage కట్టి నయం చేసుకోవచ్చు. కాని నాలుక జారితే ఆ హృదయానికి ఎక్కడ గాయం తగిలిందో ఎవ్వరికి తెలియదు. దానిని నయం చేసే డాక్టర్లు ఎవరున్నారు? కనుక హృదయానికి గాయమయ్యే రీతిగా మనం మాట్లాడరాదు. You cannot always oblige but you

603118907

can always speak obligingly. మనం ఎప్పుడో నాలుక జారుతూ వుంటాము. అలా అనదానికి పశ్చాత్తాపం, ప్రాయశ్చిత్తం అన్నారు. తిరిగి అయ్యో! వారిని బాధపెడితినే అని ఒక్క తూరి నీవు హృదయపూర్వకంగా పశ్చాత్తాప పడితే తప్పక దానికి ప్రాయశ్చిత్త మవుతుంది.

మానవత్వములో యీ దివ్యమైన భావాలు నిండి వుండాలి. అదే నిజమైన విలువ. కొంత మంది అనేక దుష్టాలు ఈర్ష్య అసూయ, కోపము, తాపము, డంబము ఇవన్నీ పశుపక్షిమృగాదులకు కూడా వుంటున్నాయి. మానవునికి కూడా వుంటున్నాయి. కాదు. కాదు మానవత్వంలో ఒక ప్రత్యేకమైనది, దైవార్పిత బుద్ధి రావాలి. ఏది చూసినా దైవకార్యంగా విశ్వసించాలి. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థము. ఆ విధమైన భావంతో చేసినప్పుడే మీ దేహము, మనస్సు బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, అంతఃకరణ అన్నీ పరిశుద్ధ మవుతాయి. మోక్షమనగా ఏమంటే చిత్తశుద్ధియే. హృదయం పవిత్రంగా వుంటే అదే అన్నివిధాలా ఆనందంగా కనుపిస్తుంది. ఆనందమే గమ్యము.

బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞాన మూర్తిం
ద్వందాతీతం గగన సదృశం - తత్త్వమస్యాది లక్ష్యమ్
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షి భూతం
భావాతీతం త్రిగుణరహితం. .

అన్నారు. ఈ రకమైన తత్త్వాన్ని మనం వర్తించుకుంటూ పోతే పూర్తి ఆనందము. దాని వల్ల నిర్మలత్వం ఏర్పడుతుంది. slow and steady wins the race. life race not horse race. భగవంతుని మరచినామంటే ఇంక మనకే మాత్రం ఆధారం లేదు. Hero becomes zero if one forgets God. దైవమును మరువ కూడదు. అన్ని విధముల అనుగ్రహించేది దైవమే. ఈ లోకములో బ్రతకటానికి తగిన ఆదర్శాలు, ఆనందాలు, అనుకూలములు చేకూర్చినది దైవమే. అలాంటి దైవాన్ని మరచిపోతే కృతజ్ఞత లేని క్రూరుడై పోతాడు.

gratitude. మొట్టమొదట gratitude కావాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా ఆ అందించిన ఆనందానికి తగిన కృతజ్ఞతను మనం తెల్పాలి. ఆ కృతజ్ఞతను హృదయములో పెట్టుకొని జీవించటానికి ప్రయత్నించండి. ఇదే మానవత్వానికి తగిన అభివృద్ధికి సోపానంగా యేర్పడుతుంది. మొట్టమొదట తల్లితండ్రులకు తగిన కృతజ్ఞతను అందించండి. ఎందుకంటే నీ body, blood, food, head, డబ్బు అన్నీ parents gift. మొట్టమొదట parentsకు gratitude తెల్పాలి. అప్పుడే నీ children నీకు తిరిగి gratitude అందిస్తారు. ఈనాడు తల్లితండ్రులను అగౌరవపరిచేవాడు రేపు బిడ్డల చేత అగౌరవం అందుకుంటాడు. ఈ నాడు నీ స్నేహితుని వంచించటానికి ప్రయత్నం చేస్తే నీ స్నేహితుడు నిన్ను రేపు వంచిస్తాడు. Reaction, reflection, resound తప్పునవి కావు. కనుక మంచి చేసి, మంచి చూసి, మంచిని అనుభవించి, మంచిగా జీవించు. విద్యార్థులు, చేరిన వ్యక్తులు పవిత్ర భావములతో దివ్యమైన తత్త్వాన్ని అభివృద్ధి చేసుకొని

603118908

జీవితాన్ని సార్థకం చేసుకొని, ఆదర్శవంతమైన జీవితాన్ని అన్యులకు అందించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.